## రిపోర్టు :

# రాచకొండ ఫైరింగ్ రేంజ్

'రాచకొండ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్' పేరిట నల్లగొండ - రంగారెడ్డి జిల్లాలో విశాల భూభాగాన్ని సేకరించే పథకం ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ అధికార్లు పూర్తి వివరాలు తెలియ జేయడానికి నిరాకరిస్తున్నప్పటికీ, దాదాపు 31,000 ఎకరాల భూభాగాన్ని సేకరించడానికి సర్వే పూర్తి అయిందనీ, ఇంక సేకరణ కార్యక్రమమే తరువాయి అనీ ఖచ్చితంగా తెలుస్తున్నది. రెవెన్యూ, అటవీశాఖల అధికార్లు సర్వే అయిన ప్రాంతాన్ని పర్యటించి తమ రిపోర్టు ప్రభుత్వానికి అందజేయాల్సిందిగా ప్రభుత్వం ఆర్డర్లు జారీ చేసింది. అయితే ఆ పని ఇప్పటి దాకా మొదలు పెట్టలేదని నల్గొండ ఆర్.డి.వో అంటున్నారు. దీని వలన దిగువ పేర్కొన్న గ్రామాల రైతులు నష్టపోతారు.

**సంస్థాన్ నారాయణపూర్ మండలం :**

ఎంకంబాయి తండ (మహమ్మదాబాద్ పంచాయితీ)

వాబ్యాతండ (జనగాం పంచాయితీ)

మర్రిబాయి తండ (వావిళ్ళపల్లి పంచాయితీ)

రాంబాయి తండ ( చిల్లాపూర్ పంచాయితీ)

**చౌటుప్పల్ మండలం :**

ఎనగింటి తండ (పీపల్ పహాడ్ పంచాయితీ)

తూంబాయి తండ (రాచకొండ పంచాయితీ)

అల్లాపురం

దేవలమ్మనాగారం

దండుమల్కాపురం

తమ భూములలో ఎంత భాగం రాచకొండ ఫీల్డ్ ఫైరింగ్ రేంజిలో పోతుందో, మాగాణి పోతుందో లేక మెట్ట భూమి పోతుందో, తిరిగి తాము నివాసం ఎక్కడ ఏర్పాటు చేసుకుంటారో తెలియక, రైతులూ, కూలీలు సతమతమవుతున్నారు. అధికారులు మొత్తం భూమి సేకరణ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఎవరిని అడిగినా 'మాకేమి తెలీదంటున్నారు'. నష్టపోయేది ఎక్కువగా లంబాడా తండాలు కావడం వల్ల అధికారుల నిర్లక్ష్యం మరింత ఎక్కువగా ఉంది. ప్రజల జీవన్మరణాలకు సంబంధించిన అత్యవసర విషయాన్ని ఇంత గోప్యంగా ఉంచడం అప్రజాస్వామికమని ఎవరికీ తోచినట్లు కనబడదు.

ఇప్పటి దాకా పత్రికలలో వచ్చిన వివరాలను బట్టి, సేకరిస్తున్న భూభాగం దాదాపు 31,000 ఎకరాలు కాగా అందులో 15,000 ఎకరాలు రైతుల పట్టా భూమి అని తెలుస్తూ ఉంది. అంటే సేకరిస్తున్న భూమిలో దాదాపు సగం పట్టా భాగమే. అయితే ప్రభుత్వ లెక్కలలో ప్రభుత్వ భూమిగానో అటవీ భూమి గానో నమోదయిన దానిలో వాస్తవానికి రైతులు పట్టాలేకుండా సేద్యం చేస్తున్నది చాలా వుంది. ఉదాహరణకు ఎనగంటి తండ, అల్లాపురం, తుంబాయితండ, దండుమల్కా పురంలలో ఇటువంటి భూమి వందల ఎకరాలు ఉంది దీనిని 'ప్రభుత్వ భూమి'గా రికార్డు చేయటం వల్ల ఆ రైతులకు నష్టపరిహారం దక్కదు. అంతేకాక, రైతుల పట్టా భూమి అయిన 15,000 ఎకరాలలో ప్రభుత్వం కేవలం 117 ఎకరాలను మట్టుకే మాగాణి భూమిగా గుర్తించింది. ఇది చాలా తక్కువ అంచనా. పౌరహక్కుల సంఘం పర్యటించిన గ్రామాలలోనే కొన్ని వేల ఎకరాల మాగాణి వుంది. ముఖ్యంగా, సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం, వావిళ్ళపల్లి, చిల్లాపూర్, పంచాయితీలలో వున్న 20 తండాలలో మెట్ట భూమికంటే మాగాణి పొలాలే ఎక్కువ. ఆ ప్రాంతంలో భూగర్భజల సంపద అపారంగా వుంది. కేవలం 25 లేక 30 అడుగుల లోతు బోర్లు వేసుకొని ఎకరానికి 40 నుండి 50 బస్తాలు దాకా వడ్లు పండిస్తున్నారు. ప్రతి తండాలోను సేద్యమయ్యే భూమిలో 15 శాతం తరి పొలాలేనని రైతులంటున్నారు. ఈ మాగాణి పొలాలు పోకుండా కేవలం మెట్ట భూమి మట్టుకే ఫైరింగ్ రేంజ్ కోసం ఎట్లా తీసుకుంటారు.

ఒక్క నల్గొండ జిల్లానే తీసుకున్నా, ఫైరింగ్ రేంజ్ భూభాగంలో 31 తండాలున్నాయని రెవిన్యూ అధికారులే అంటున్నారు. వీటి జనాభా ఎంత తక్కువనుకున్నా 20 వేలు ఉంటుంది. మొత్తం రేంజ్ ప్రాంతంలో 40 లేక 50 వేల జనాభా ఉండవచ్చును. వీళ్ళ భవిష్యత్తేమిటి? ఫైరింగ్ రేంజ్‌ను అధికార్లు రెండుగా విభజిస్తున్నారు. పూర్తిగా సేకరించే ప్రాంతం (acquired area ), ప్రకటిత ప్రాంతం ( Notified area ) అని రెండుగా విభజించారు. ఈ విభజన అర్థం ఏమిటో రెవిన్యూ అధికారులు చెప్పడం లేదు. 'సేకరించిన ప్రాంతం'లో ఉండనిస్తారా? వ్యవసాయం చేసుకోనిస్తారా? ఈ వివరాలు తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయం సంగతి అటుంచి, అటవీ ప్రాంతం సుమారుగా వున్న ఈ గ్రామాల ప్రజలు కట్టె కోసం, పశువుల మేత కోసం, అడవుల మీద ఎక్కువగా ఆధారపడతారు. ఫైరింగ్ రేంజ్ వస్తే అది సాధ్యం కాదు. పశువులను వాళ్ళు ఇక మీదట ఎక్కడ మేపుకోవాలి? కట్టె ఎక్కడ తెచ్చుకోవాలి?

భూమి సేకరణ ఏర్పాట్లు ప్రభుత్వం గోప్యంగా ప్రారంభించింది గానీ పునరావాసం గురించి మాట్లాడడం. లేదు ప్రస్తుతం ఈ తండాలల్లో బోర్లు వేసుకొన్న భూములు చాలా విలువయనవి. ఎకరం 60 వేలు పైగా ఖరీదుంది. ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం ఇస్తుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ ఇచ్చినా అంత మంచి భూమి వేరే ఎక్కడ దొరకాలి. అసలు భూములే లేని వారి సంగతి ఏంటి ?వాళ్ళకు పునరావాసం, పునరుద్యోగం ఎక్కడ కల్పిస్తారు? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?